క్లుప్తంగా

యారాడ తీరంలో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



యారాడ తీరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

పెదగంట్యాడ : యారాడ తీరంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లను హార్బర్ డీసీపీ – 2 మేరీ ప్రశాంతి గురువారం పరిశీలించారు. తీరం వద్ద బందోబస్తు ఏర్పాట్లు, లైటింగ్, గజ ఈతగాళ్లు, మంచినీటి వసతి, తదితర వివరాలను సీఐ కామేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల నుంచి యారాడ తీరానికి ఎక్కువగా గణపతి ప్రతిమలు నిమజ్జనానికి తీసుకొస్తారని... ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, నిమజ్జన సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా చూడాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గాజువాక : జీవీఎంసీ 66వ వార్డులోని బీసీ రోడ్, అజీమాబాద్, నవాబ్‌నగర్, కైలాసనగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2.84 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు 80 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన 20 శాతం పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పెదిరెడ్ల ఈశ్వరరావు, దుబాయి బాషా, కరణం వేణుగోపాలరావు, రెడ్డి జగన్నాథం, కర్రి జగన్ మోహన్‌రెడ్డి, కుప్పిలి సత్యనారాయణ, నసీర్, ఫజిల్ రెహ్మాన్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, గోమాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు పట్టాలపై లభ్యమైన మృతదేహం

పెదగంట్యాడ : న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నోవాస్ అపార్ట్‌మెంట్ ఎదురుగా అదానీ గంగవరం పోర్టుకు వెళ్లే రైలు పట్టాలపై తల తెగి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దీనిపై స్థానికులు పోలీసులకు గురువారం సమాచారం ఇవ్వడంతో స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, సంబంధీకులు న్యూపోర్టు పోలీస్ స్టేషన్ (9440904309)లో సంప్రదించాలని సూచించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సమస్యల పరిష్కారానికి వినతి



వినతిపత్రం అందిస్తున్న జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు ఈశ్వర్, విజయ్‌కుమార్

అగనంపూడి : విశాఖ పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్‌ను జోనల్ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి భువనేశ్వర్ వెళ్లిన ఈశ్వర్ సమస్యలతో కూడిన వినతిప్రతాన్ని గురువారం అందించారు. విశాఖ – నర్సాపురం ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని, దువ్వాడలో కోచ్ నిర్వాహణ, రేక్‌ల నిర్వాహణ చేపట్టాలని, విశాఖ సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్‌కు దువ్వాడలో హాల్ట్ ఇవ్వాలని, శ్రీకాకుళం రోడ్డు, రాజమండ్రి, కాకినాడ, విశాఖ మధ్య షటిల్ సర్వీస్‌లు నడపాలని, దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మించాలని కోరారు. కాపుజగ్గరాజుపేట ఇరుకు, మలుపుల అండర్‌పాస్ వంతెన సమస్య పరిష్కరించాలని, ప్లాట్‌ఫామ్ 4 వైపు జనరల్ బుకింగ్ కౌంటర్‌లో పీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, విశాఖ – తిరుపతి డబల్ డెక్కర్ రైలులో కోచ్‌లు పెంచాలని ఈశ్వర్ అభ్యర్థించారు. ఆయనతోపాటు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధి కె.విజయ్‌కుమార్ ఉన్నారు.



64వ వార్డులో వినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్



68వ వార్డులో వినాయక స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్



గణపతి మండపానికి లడ్డూ ప్రసాదం అందిస్తున్న ధర్మాల శ్రీనివాసరావు



69వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోగాది సన్ని ఆధ్వర్యంలో వినాయక పూజల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు

వక్రతుండాయ.. విభిన్న రూపాయ

పారిశ్రామిక వాడలో అంగరంగ వైభవంగా గణపతి పూజలు



దయాల్‌నగర్ లోవలో అయ్యప్ప స్వామి అవతారంలో గణేశుడు



పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో ఘనంగా ప్రారంభమైన వినాయక నవరాత్రులు



జీవీఎంసీ 75వ వార్డులో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు, నిర్వాహకులు



సెక్టర్ 6 కాంప్లెక్స్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడు



ఏకదంతుడిని దర్శించుకుంటున్న 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ తదితరులు



ఫార్మాసిటీలోని మండపంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు, నిర్వాహకులు

గాజువాక : వినాయక ఉత్సవాలు గాజువాకలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వినూత్న సెట్టింగ్‌లతో కూడిన మండపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి వేడుకలను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి హోమం, మంగళ శాసనాలు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. పాతగాజువాకలోని లంకా మైదానంలో ఏర్పాటు చేసిన 111 అడుగుల సుందర వస్త్ర మహాగణపతి విగ్రహాన్ని బుధవారం ఘనంగా ప్రతిష్ఠించారు. భక్తులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు మహాగణపతిని దర్శించుకున్నారు. రాష్ట్రంలోనే పెద్ద విగ్రహం కావడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు. 21 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు..

నియోజకవర్గంలో ఏడు వందలకు పైగా విగ్రహాలు ఏర్పాటు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి, వివిధ వార్డుల కార్పొరేటర్లు తమ నాయకులతో కలిసి పలుచోట్ల స్వామి వారిని దర్శించుకుని నిర్వాహకులను అభినందించారు.

వాడవాడలా వేడుకలు..

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నెల్లిముక్కు ధర్మాల వీధిలో పెంటమాంబ యువజన సేవా సంఘం ప్రతినిధులు ధర్మాల ఎల్లయ్యరెడ్డి, పిట్ట రమణారెడ్డి, గురిబిల్లి బాబూరావు, నీలాపు సత్తిబాబు, అప్పారావు, ధర్మాల రామిరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలి పూజలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు తిప్పల సతీష్ రెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, కాతా బాలకృష్ణ గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

- 74వ వార్డు దయాల్‌నగర్ లోవలో లక్కీ యూత్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి అవతారంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణేషుడు భక్తులను ఆకట్టుకున్నాడు.
- 64వ వార్డు గంగవరంలో వార్డు వైఎస్సాసీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొవిరి ఆది, సలీమ్, మాధ అప్పారావు, కొవిరి బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.
- నడుపూరులో సంకటమోచన గణపతి దేవాలయాంలో ఆలయ కమిటీ చైర్మన్ మంత్రి నరసింహమూర్తి, జయంతి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 76వ వార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

అగనంపూడి: జీవీఎంసీ 79,85,88 వార్డుల్లోని అగనంపూడి, ఫార్మాసిటీ, దువ్వాడ నిర్వాసితకాలనీలు, లంకెలపాలెం, వెదుళ్లనరవ ప్రాంతాల్లో భారీ స్థాయిలో మండపాలు ఏర్పాటు చేశారు. పెదమడకలోని సంపత్ వినాయక ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ ఘనంగా ప్రారంభించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, మడుగల నరసింగరావు, నెల్లి శ్రీనివాసరావు, విందుల నారాయణరావు, మజ్జి శ్రీను, మడుగుల జగ్గారావు, అమరపిని సోమేశ్వరరావు, అప్పలరాజు, చిన్నారావు, గంగరాజు, వరహాలరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ, అగనంపూడి సెక్టార్–1,3 నిర్వాసిత కాలనీల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో గణపతికి పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కర్రి దోంంద్ర, డొక్కా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం పలు సెక్టార్లలో..

ఉక్కునగరం: సెక్టర్–1లో సత్యసాయి సేవా కేంద్రంలో భక్తులు వినాయకచవితి పూజలు చేశారు. బాల వికాస్, అనాథ బాలలు చేసిన మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. సెక్టర్–1 కాంప్లెక్స్‌లో సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి స్థానికులు పూజలు చేశారు. ట్రై వీక్లీ వర్తకుల ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సెక్టర్–4 కాంప్లెక్స్‌లో వర్తకులు, ఉద్యోగులు వినాయకునికి పూజలు చేశారు. సెక్టర్–5 జై గణేష్ పూజా కమిటీ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహానికి వర్తకులు, ప్రజలు పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు. సెక్టార్–6 షాపింగ్ కాంప్లెక్స్‌లో సిద్ధి వినాయక పూజా కమిటీ, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఎనిమిది అడుగుల వినాయక ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. సెక్టార్–8 నుంచి 11 వరకు ఉన్న ఉద్యోగుల ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో పూర్తిగా మట్టితో చేసిన వినాయక విగ్రహానికి ఆయా సెక్టార్లకు చెందిన ప్రజలు పూజలు చేశారు.



గణపతికి పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు



గణపతి పూజల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



సెక్టర్ 5 కాంప్లెక్స్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు



లంబోదరుడిని దర్శించుకుంటున్న 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు తదితరులు

ఆదుకోవాలంటూ ఆటో డ్రైవర్ల ఆందోళన



సమతానగర్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు, యూనియన్ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు, సీహెచ్ అప్పారావు తదితరులు



అగనంపూడి కూడలిలో నిరసన తెలుపుతున్న శ్రీశ్రమశక్తి ఆటోస్టాండ్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు



లంకెలపాలెం కూడలిలో స్టాండ్‌లో నిలిపేసిన ఆటోలు

పెదగంట్యాడ : స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశమివ్వడంతో ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని, జీవనోపాధి కోల్పోతున్న వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పెదగంట్యాడ కూడలితో పాటు పలు ప్రాంతాల్లో గురువారం పెదగంట్యాడ ఆటో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ అప్పారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. న్యాయం చేయాలంలూ ఆటోలు నిలిపివేసి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఆటోవాలాలకు మద్దతు తెలిపిన ధర్మాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటో డ్రైవర్ల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాహన మిత్ర పథకం అమలు చేసి ఒక్కో డ్రైవర్‌కు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని... నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఆదుకోకుంటే ఆందోళన ఉధృతం

యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ డిగ్రీలు చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు రాక కొందరు.. మరి కొందరు చదువు లేక ఆటోలను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఆర్థిక స్థోమత లేక బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి ప్రతీ నెల వాయిదాలు చెల్లిస్తున్నామని వాపోయారు. మిగిలిన సొమ్మును కుటుంబాల పోషణకు, ఇళ్ల అద్దెలకు చెల్లిస్తూ భారంగా బతుకుతున్న తమకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. తనిఖీల పేరుతో పోలీసులు అధిక జరిమానాలు వసూలు చేస్తూ ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబరు 21, 31ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్రైవర్లకు వెంటనే రూ.15 వేలు నగదు జమ చేయాలన్నారు. ఉచిత బస్సు పథకంతో నష్టపోయిన ఆటోవాలాలకు ప్రభుత్వమే భరోసా కల్పించాలని... లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 2న పాతగాజువాక జంక్షన్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సారిపల్లి నూకరాజు, పి.సుమన్, పైడిరాజు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో ఆటో డ్రైవర్ల సమ్మె ప్రశాంతం

గాజువాక : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో నష్టపోయిన ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ గాజువాక ప్రాంతంలోని ఆటో డ్రైవర్లు గురువారం నిర్వహించిన సమ్మె ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గాజువాక ఏరియా ఆటో ఓనర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, 86 ఆటో స్టాండ్‌ల సముదాయం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు గాజువాక ప్రాంతంలో ఆటోలను నిలిపివేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. గాజువాకలో ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన స్త్రీ శక్తి పథకం తమకు శాపంగా మారిందని, ఈ పథకం తమ ఆదాయానికి గండి కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కృషి చేయాలని, అదే సమయంలో ఉచిత బస్సు పథకమంటూ తమ ఉపాధిని కొట్టొద్దని సంఘం నాయకులు పేర్కొన్నారు. డ్రైవర్ ఉనికికే సమస్యగా ఉన్న జీవో నంబర్ 21, 31లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. తనిఖీల పేరుతో ఆర్టీవోల దోపిడీని ఆపాలన్నారు. గొలగాని నాయుడు, చీపురుపల్లి అప్పారావు, రెడ్డి శ్రీను, మురళి, వెంకటరావు, జగదీష్, జెట్టి శ్రీను, పి.ప్రసాద్, పి.అప్పలరెడ్డి, నాగు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

అగనంపూడి : బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని నిరసిస్తూ ఆటోవాలాలు రోడ్డెక్కి ఆందోళన చేయడంతో ఆటోలు స్టాండ్‌లకే పరిమితమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆటో సంఘాల పిలుపు మేరకు లంకెలపాలెం కూడలిలో శాంతియుత నిరసన, రాస్తారోకో నిర్వహించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకం అమలు చేసి ఏడాదికి రూ.25 వేలు అందివ్వాలని, పెట్రోల్, గ్యాస్, డీజిల్‌పై విధించిన పన్నును తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, రమణ, నరసింగరావు, గోపి, రవి పాల్గొన్నారు.

- అగనంపూడి జాతీయ రహదారి కూడలిలో శ్రీ శ్రమశక్తి ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల స్థానికంగా వందలాది మంది ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ ప్రతినిధులు గుర్రం శ్రీను, సురవరపు నందగోపాల్, నక్కా గోవింద్, చిన్న బాబు, సూర్యచంద్రరావు, చిన్న, బొరయ్య పాల్గొన్నారు.

ఆటోల బంద్‌తో ఇబ్బందులు

కూర్మన్నపాలెం : స్త్రీ శక్తి పథకం అమలుతో ఆదాయం కోల్పోయామంటూ ఆటో డ్రైవర్లు గురువారం ఆందోళనకు దిగారు. తమ ఆటోలను ఎక్కడికక్కడ నిలిపేసి నిరసన తెలపడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. కూర్మన్నపాలెం కూడలి, రాజీవ్‌నగర్, వడ్లపూడి ఆటోస్టాండ్‌లలో డ్రైవర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఆటోడ్రైవర్లకు అనేక హామీలు ఇచ్చారని... అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తమ పరిస్థితి మరీ దారుణంగా తయారైందని వాపోయారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటోలు తిరగకపోవడంతో సామాన్యులు కొంచెం ఇబ్బందులు పడ్డారు.



లంకెలపాలెం కూడలిలో ఆందోళన చేస్తున్న మరిడిమాంబ యూనియన్ ఆటో డ్రైవర్లు



కూర్మన్నపాలెంలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు



గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

వడ్లపూడి రహదారిలో కూరుకుపోయిన లారీ

- గోతుల రోడ్డుపై రాకపోకలకు అవస్థలు



వడ్లపూడి రహదారిపై కూరుకుపోయి పక్కకు ఒరిగిన లారీ

కూర్మన్నపాలెం : గోతులమయమై అస్తవ్యస్తంగా తయారైన వడ్లపూడి రహదారిపై గురువారం ఓ భారీ లారీ కూరుకుపోయింది. లోడుతో ఉన్న ఆ లారీ ఓ పక్కకు ఒరిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆ లారీని అక్కడి నుంచి తీసేందుకు రెండు క్రేనులు గంటల కొద్దీ శ్రమించాల్సి వచ్చిందంటే రోడ్డు ఎంత అధ్వానంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. లారీ ఒరిగిపోవడంతో అటు వైపుగా వెళ్లేందుకు స్థానికులు, వాహనదారులు భయపడ్డారు. కొద్ది రోజుల కిందటే ఓ ఆటో కూడా ఈ రోడ్డులో కూరుకుపోయింది. అస్తవ్యస్తంగా తయారైన వడ్లపూడి రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రహదారి మొత్తం గోతులతో నిండిపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. దీనికితోడు పైప్‌లైన్లు, కేబుళ్ల కోసం రోడ్డు మార్జిన్లలో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేసి సరిగ్గా పూడ్చకుండా వదిలేశారు. ఫలితంగా భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు ఆ గోతుల్లోకి దిగిపోయి ముందుకు కదలకుండా కూరుకుపోతున్నాయి. వాటిని బయటకు తీసి అక్కడి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు అధికారులు, వాహనదారులు వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వందలాది వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులైతే గోతుల్లో పడి ప్రమాదాలకు గురవడం నిత్యకృత్యమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వడ్లపూడి రహదారికి మోక్షం కలిగించాలని పలువురు కోరుతున్నారు.



ఒరిగిపోయిన లారీని బయటకు తీస్తున్న క్రేన్